# తుంగ

వారం నుండి ఆ సినిమా చూద్దామని అనుకుంటోంటే చివరకు ఆ రాత్రి రెండో ఆటకు కాని వీలుకాలేదు. సినిమా హాలు మా కాలనీకి అరగంట నడక దూరంలో ఉంది. నడచినట్టు ఉంటుందని బండి బయటకు తీయలేదు. నా భార్య ఊళ్ళో ఉండుంటే కలిసి వెళ్ళేవాళ్ళం. ఆమె లేకపోడం నాకు ఇబ్బందిగానే ఉంది. చాలా విషయాల్లో మంచి స్నేహితుడిగా నన్ను నడిపిస్తూ ఉండేది.

సినిమా అయిపోయేసరికి పన్నెండు దాటింది. హాలుకు అటువయిపు మాకాలనీ. సిగరెట్ వెలిగించి నడవడం మొదలుపెట్టాను. ఆ సమయంలో రిక్షాలు దొరకవు. పొలాల మీంచి చల్లటి గాలి వీస్తోంది. సగం మిగిలిన చంద్రుడు నాతోపాటు నడుస్తున్నాడు. చొక్కా కాలరు మెడచుట్టూ లాక్కున్నాను.

పావుగంట నడిచి ఉంటాను. కాలనీ సగం దూరానికి వచ్చింది. అంతలో నా వెనక ఎవరో పరుగెడుతూ వస్తున్న చప్పుడు వినిపించేసరికి ఆగి, వెనక్కి తిరిగి చూశాను. తలకు తువ్వాలు చుట్టుకున్న ఇద్దరు వ్యక్తులు వేగంగా పరుగెత్తుకుంటూ వస్తున్నారు. ఒకడి చేతిలో ఇనుపరాడ్ లాటిది, మరొకడి చేతిలో పొడవాటి కత్తిలాటివేవో ఉన్నట్టనిపించింది. మా ఊళ్ళో మనుషులను దోచుకోరు. చంపేస్తారు. శవాలను దొరకనీరు. అథవా దొరికినా సాక్ష్యాలుండవు. పంచనామా జరుగుతుంది. కేసులు ఉండవు. ముందు వాళ్ళను ఎవరయినా తరుముకుంటూ వస్తున్నారేమోనని అనుకున్నాను. వాళ్ళ అరుపులు విన్నాక కాని నన్ను చంపడానికి నా వయిపు వస్తున్నారని గ్రహించేసరికి నాగుండె ఝల్లుమంది. వాళ్ళెవరో గుర్తు పట్టడానికి వీలుకాలేదు. "వీడే... నరుకు.... నా కొడుకును... " అన్నవాడి గొంతు బొంగురుగా ఉంది. అదినాకు పరిచయం లేని కంఠస్వరం. అదే మొదటిసారిగా వినడం.

రెండోవాడు ఏమన్నాడో నాకు వినిపించలేదు. నేను ఎవరినో వాళ్లకు తెలుసు. మరో నిమిషం అలానే నుంచుండి ఉంటే నా పని అయిపోయి ఉండేది. బొంగురుగొంతు వాడు అరిచి నన్ను రక్షించినట్లనిపించింది. నేను ఆగలేదు. పరుగు అందుకున్నాను. రోడ్డు కిందకు వచ్చి పొలాల్లోకి దూసుకెళ్ళాను. చెప్పులు ఎక్కడో జారిపోయాయి. ఎక్కడ ఏముందో, నేనెటుపక్కకు వెళ్తున్నానో నాకు అర్థం కావటం లేదు. జీవితంలో అంత వేగంగా నేను ఎప్పుడూ పరుగెత్తలేదు. ఎన్ని స్పర్థలున్నా ఎవరిమీద ఏనాడూ చేయి చేసుకోలేదు. ఇబ్బందుల పాలు చేయలేదు. మంచిమాటలలోనే పనులు చేయించుకుంటాను. పోట్లాట పెట్టుకోను. నా వెంటబడిన వీళ్ళెవరో, నన్నెందుకు చంపాలనుకుంటున్నారో? నా వ్యాపార లావాదేవీల్లో సంబంధం ఉంటుందని అనుకోను. చాలా మటుకు రహస్యంగా ఉంచుతాను. మరొకరు తెలుసుకునే అవకాశం ఇవ్వను. నా మూలాన నష్టపోయే పరిస్థితిని కల్పించను.

అట్టేదూరం పరుగెత్తలేకపోయాను. అప్పటికే అలుపు వచ్చింది. తాటిచెట్టును ఆసరాగా చేసుకుని నిలబడ్డాను. ఊపిరి తీసుకోవడం కష్టమవుతోంది. దగ్గడానికి భయం వేస్తోంది. చెమటలు పట్టి బనియను, చొక్కా తడిచి పోతున్నాయి. కాళ్ళు, చేతులు వణుకుతున్నాయి. కళ్లు మూతలు పడుతున్నాయి.

గర్భిణితో ఉన్న నా భార్య గుర్తు వచ్చింది. ఆమె నా కంటే ధైర్యస్థురాలు. ఆమె ధైర్యంలో నాకు పదోవంతు కూడా లేదు. జేబులోంచి రుమాలు తీసి ముఖానికి పట్టిన చెమటను తుడుచుకున్నాను. వెంటనే చెమట పడుతోంది. నేనున్న చోటు ఎత్తుగా ఉండడం వలన పలచటి వెలుతురులో రోడ్డు కనబడుతోంది. రోడ్డుమీదొకడు నిలబడి ఉన్నాడు. రెండోవాడు నన్ను వెతికే ప్రయత్నంలో ఉండి ఉండాలి.

పది నిమిషాల తర్వాత రెండోవాడు పొలాల్లోంచి బయటకు వచ్చాడు. ఇద్దరూ కలిసి మా కాలనీ వయిపు నడవసాగారు. వాళ్ళకు మా ఇల్లు తెలుసనుకుంటాను. సామాన్యంగా నాతో పాటు ఎప్పుడూ నలుగురయిదుగురు స్నేహితులు ఉండేవారు. నా దురదృష్టం కొద్దీ ఆపూట నాతో ఎవరూ లేరు. మా స్నేహితుడి పెళ్ళికి పక్క ఊరు వెళ్ళారు. నేనూ వెళ్ళాల్సిన వాడినే. ఎవరిదో రిజిస్ట్రేషన్ ఉండి వెళ్ళలేకపోయాను. నా గురించి సమాచారం, కదలికలు నన్ను చంపడానికి వచ్చిన వాళ్లు తెలుసుకుంటూ ఉండి ఈ సమయంలో ముహూర్తం పెట్టుకుని పని ముగిద్దామనుకుని ఉండాలి.

అలుపు తగ్గి ప్రాణం కుదటపడేవరకు అక్కడే కదలకుండా ఉండిపోయాను. ఒళ్ళు గీరుకుపోయింది. చేతిగడియారం ఊడి ఎక్కడో పడిపోయింది. కాళ్ళు నొప్పి

పుడుతున్నాయి. పాదాలకు ముళ్ళో, సీసా పెంకులో, ఇనుపతీగలో, కోసురాళ్ళో గుచ్చుకుని ఉండాలి. తీపుపెడుతూ కొద్దికొద్దిగా రక్తం రెండు పాదాలనుండి వస్తోంది. ఒక కాలు మటుకు భారంగా ఉంది. రెండవ కాలు నడవనిస్తోంది. పొలాలగట్టున కుంటుకుంటూ రోడ్డుమీదకు వచ్చాను.

పక్కగా నడుస్తూ అతికష్టంమీద ఊళ్ళోకి వచ్చాను. మా కాలనీ వయిపువెళ్తే వాళ్ళిద్దరికీ దొరికిపోతాను. ఈపరిస్థితిలో దొరికితే నేను తప్పించుకున్న కసికూడా తీర్చుకుంటారు. అరకిలోమీటరు నడిస్తేగాని నా స్నేహితుల ఇళ్ళు రావు. అంత దూరం నడిచే శక్తి లేదు. రోడ్డుపక్కనే ఏ వంతెన మీదో కూర్చుని సేదతీర్చుకుందా మంటే మా కాలనీ నుండి తిరిగివచ్చే వాళ్లకు దొరికిపోతాను. ఈసారి తప్పించుకోవడం నా వలన కాదు. మాటిమాటికి నా భార్యగుర్తువస్తోంది. ఇది తొమ్మిదో నెల.

నాకు మొట్టమొదట కనిపించిన ఇంటి ప్రహరీ గోడ తలుపు తెరిచి వరండాలోకి వచ్చాక కాని నేను గోవిందమ్మ ఇంటికి వచ్చినట్లు గ్రహించలేదు. మా ఊళ్ళో అది పోష్ లొకాలిటీ కింద లెక్క. అక్కడందరూ కుక్కల్ని పెంచుకుంటారు. ఆమెకు కుక్కలంటే ఇష్టంలేదు. విశ్వాసాన్ని నమ్మదు. ఇద్దరం డిగ్రీ వరకు కలిసి చదువుకున్నాం. ఎవరితో ఎలా ఉన్నా నాతో మంచిగా ఉండేది. నాలుగు సంవత్సరాలు పయిగా కలిసి పనిచేశాం. కలిసి ఎదిగాం.మాకు అభిప్రాయ భేదాలు అప్పుడప్పుడు తలెత్తేవి. తరుచుగా కాదు. స్పర్ధలు మటుకు తలెత్తలేదు. ఆమె నా సహాయం ఎప్పుడు కోరినా నేను కాదనలేదు. తనేదో లిటిగేషన్‌లో పడితే నాలుగురోజులపాటు ఆమెతో కూర్చుని లెక్కలు సరిదిద్దాను. తెలివిగలదే కాని లెక్కల విషయంలో తప్పటడగులు వేస్తుంటుంది. నేను సరిదిద్దిన లెక్కల్లో ఆమె ఎక్కడ పొరపాటు చేసినా కోటిన్నర మునిగిపోతుంది. అదే అంటే, 'నువ్వు ఉండగా నాకేమి భయం?' అంది నవ్వుతూ. ఆమె నవ్వు చక్కగా ఉంటుంది. ఆ నవ్వే నన్ను చాలాకాలం ఎదగనీయలేదు. నేను బయటకు వచ్చాక ఆమెకు ఒక కష్టం తర్వాత మరో కష్టం వెంటాడుతుండేవి. ఆ లిటిగేషన్ కేసు ఏమయిందో ఆమె నాతో చెప్పలేదు. నేను అడగలేదు. మనసును కప్పెట్టేస్తుంది.

వరండాలో గోడకానుకుని కూర్చున్నాను. నా పక్కనే పేముకుర్చీ ఉంది. లేచి అందులో కూర్చుందామనిపిస్తోంది కాని లేవలేకపోతున్నాను. వరండాలోని మార్బల్ బండలు చల్లగా ఉన్నాయి. సమయం ఎంతయి ఉంటుందో తెలియడం లేదు.

చంద్రుడు కనబడడం లేదు. అలుపు వలన కళ్ళ మీదకు నిద్ర కూరుకువస్తోంది. నిద్రపోదల్చుకోలేదు. తెల్లవారే వరకు మెలుకువగా ఉండాలి.

కొద్దిసేపయిన తర్వాత వీధి తలుపుతెరుచుకుని గోవిందమ్మ వరండాలోకి వచ్చి నిలబడి, నడుం మీద చేతులు పెట్టుకుని రెండు నిమిషాల పాటు బయటకు చూస్తూ నిలబడి తిరిగి ఇంట్లోకి వెళ్ళబోతూ కుర్చీ పక్కన ఉన్న నన్ను చూసి ఆగి కుర్చీ దగ్గరకువచ్చింది. చీకటిలో నన్ను గుర్తు పట్టినట్టులేదు. "రాజూ" పిలిచింది.

"రాజును కాను.. నేను ..." అన్నాను. నా మాటలు నాకే స్పష్టంగా వినబడలేదు. నీరసంగా ఉంది.

వరండా లైటు వెలిగించింది. వెంటనే ఆర్చి- నా ముందుకు వంగి, "ఏమయింది... ఏమిటీ రక్తం...?" అడిగింది కలవర పడుతూ.

మెల్లమెల్లగా జరిగింది చెప్పాను. "అయ్యయ్యో ఎంత పని జరిగింది?.. మా ఆయన ఇంటికి ఇంకా చేరుకోలేదు. .. ఎదురుచూస్తూ ఇంకానిద్ర పోలేదు... నిన్ను తరుముకుంటూ వచ్చిన వెధవలను నువ్వు గుర్తు పట్టగలవా..?" అడిగింది.

"గుర్తు పట్టలేను. ఇప్పుడుటైం ఎంతయింది?"

"రెండుకావస్తోంది. ఆస్పత్రికి వెళ్దామా?"

"బాగా అలసిపోయాను. తెల్లవారాక వెళ్దాం. కొద్దిసేపు రెస్టు తీసుకుంటే కోలుకుంటాను...."

"నాతోరా..." నా చేయి అందుకుంది. ఒక చేత్తో ఆమెను గట్టిగా పట్టుకుని మరోచేత్తో కుర్చీని పట్టుకుని లేచి నిలడ్డాను. నా చేయి తన నడుం చుట్టూ వేసుకుని, "నడవగలవు కదూ?" అడిగింది.

"నడవగలను."

నన్ను మెల్లగా వాళ్ళ వంటగదికి అవతల ఉన్న గది వరకు తీసుకువచ్చింది. ఒక మోస్తరు గది అయినా గదిలో అన్ని సదుపాయాలున్నాయి. లోగడ ఆ గదిలో చాలాసార్లు పడుకున్నాను. "లోపల మంచం మీద పడుకో. తెల్లవారగానే ఆస్పత్రికి తీసుకువెళ్తాను. ఇప్పుడు నెమ్మదిగా ఉంది కదా?" అడిగింది.

తలూపాను. నేను గదిలోకి అడుగిడగానే తలుపు దగ్గరగా లాగింది. నా వెనక తలుపు మూసుకుపోయింది. ఈ ఆదరణకు నాకెంతో ఊరట కలిగింది. ముక్కలవుతున్న ప్రాణాన్ని కూడగట్టుకుంటున్నట్టుగా అనిపిస్తోంది. లైటు వేశాను. గది మధ్యలోని మంచంమీద గోవిందమ్మ భర్త కృష్ణారావు పడుకుని ఉన్నాడు. తన

భర్త ఇంటికి వచ్చి ఈ గదిలో పడుకున్న సంగతి ఆమెకు తెలిసి ఉండకపోవచ్చు. కృష్ణారావు నిద్రపోతున్నాడనుకుంటాను. కృష్ణారావు కోసం ఎదురు చూస్తూ ఇంతవరకు నిద్రపోకుండా ఉంది. ఆమెకు ఈ విషయం చెబుదామని తలుపు గడియ పట్టుకుని లాగాను. రాలేదు. మరొకసారి లాగాను. గడియ ఊడొచ్చింది. అతని పక్కన పడుకోవడం నాకు ఇష్టం అనిపించలేదు. లైటు ఆర్పేసి బీరువా పక్కన ఉన్న కుర్చీలో కూర్చున్నాను. గది విస్కీ వాసన వేస్తోంది. ఆమె దురదృష్టం ఏమిటంటే కృష్ణారావు మందులోనే ఎప్పుడూ ఉంటాడు. కిటికీలు మూసిఉన్నాయి. తెరుద్దాం అనుకుంటూనే నిద్రలోకి జారిపోయాను.

ఎక్కువసేపు నిద్రపోలేదు. చప్పుడవుతూ తలుపు తెరుచుకుంటోంటే మెలకువ వచ్చింది. గోవిందమ్మ అనుకున్నాను. కాదు. ఇద్దరు వ్యక్తులు లోపలికి రావటం బయటనుండి లోపలికి పడిన వెలుగులో కనిపించింది. తలుపు వెంటనే మూసుకుపోయింది. లైటు స్విచ్ వేసినట్టుంది. బల్బువెలిగి 'టుప్'మని మాడిపోయింది. లైటు వెలిగి ఉంటే బీరువా పక్కన ఉన్ననేను వాళ్ళ కంటపడి ఉండేవాడిని. మంచం మీద పడుకున్న కృష్ణారావును ఇనపరాడ్‌తో బలంగా కొట్టినట్టుంది. బాధతో మూలిగాడు. రెండో దెబ్బకు చనిపోయి ఉండాలి. పలుకు వినబడలేదు. నిజానికి అవి నాకు తగలాల్సినవి.

"ఆ గోనెసంచి ఇవ్వు" అన్నాడు ఒకడు. ఆ బొంగురుగొంతు నేను గుర్తుపట్టాను. అతని పేరే 'రాజు' అయి ఉండొచ్చు. మనిషిని గోనెసంచిలో పెట్టి మూతకట్టి బయటకు తీసుకెళ్ళారు. కృష్ణారావు చనిపోయి ఉండాలి. నేను మరోసారి బతికాను.

మన చాలా ఊళ్ళలాగే మా ఊరును. శవాలు చస్తే దొరకవు. బతికి ఉన్నవాళ్లు సాక్షం చెప్పరు. గోవిందమ్మతో నేను విడిపోయాను తప్ప ఆమెను ఏ విధంగానూ నష్టపరచలేదు. అన్యాయం చేయాలని కూడా అనుకోలేదు. నామీద ఇంత కక్ష పెట్టుకుంటుందని నేను ఊహించలేదు. పావులు కదపదని కాదు. నన్ను తక్కువ అంచనా వేసింది.

❖ ఆదివారం వార్త, 30 డిసెంబర్ 2007